# గొర్రె కాపరుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట..

**వెల్దండ, జూలై 10 ప్రభాతవార్త:** గొర్రె కాపరుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. వెల్దండ మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామాలకు చెందిన సోమవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి విడత గొర్రెల పంపిణీను సద్వినియోగం చేసుకొని 2వ విడత ద్వారా గొర్రెలను పంపిణీ చేస్తున్నామని, గొర్రెల పంపిణీ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ముందు చూపుతో మాంసం ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలిచామని, గొర్రెల పంపిణీ ద్వారా ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ పథకం ఎంతో లబ్ధి అవుతుందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను గొంగడితో సన్మానించి గొర్రె పిల్లను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయజైపాల్‌నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, సర్పంచ్ గాలమ్మ, ఎంపీటీసీ మోతిలాల్‌నాయక్, గుత్తి వెంకటయ్య, నాయకులు భాస్కర్‌రావు, కొండలుయాదవ్, బాల్‌చెన్నయ్యతో పాటు తదితరులు ఉన్నారు.



గొర్రెలను అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## ప్రతి ఫిర్యాదును సత్వరమే పరిష్కరించాలి

**గద్వాల కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**గద్వాల ప్రతినిధి, జులై 10 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఒసి సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల ద్వారా 80ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులలో ఆసరా పెన్షన్‌కు సంబంధించి 16దరఖాస్తులు, భూ సమస్యలు, భూసర్వే, ఎలక్ట్రిసిటి, రెవెన్యూ వివిధ శాఖలకు సంబంధించి 64దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖల జిల్లా అధికారులు సంబంధిత మండల అధికారులతో చర్చించి వారి పరిధిలోని దరఖాస్తులు పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్న ప్రతి ఒక్కరి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్, ఆర్డీఓ రాములు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## మంచిగా చదువుకుని ఉన్నతస్థాయిలో రాణించాలి

**- వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**వనపర్తి, జూలై10, ప్రభాతవార్త:** విద్యార్థినిలు మంచిగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నతస్థాయిలో రాణించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూలో సానియా అనే విద్యార్థిని 480/500 మార్కులు సాధించి కళాశాల టౌన్ టాపర్‌గా నిలిచింది. సోమవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆమెను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మంచిగా చదువుకుని భవిష్యత్తులో ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని సూచించారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ ఖాజా కుతుబుద్దీన్ మాట్లాడుతూ... విద్యార్థినిలు కష్టపడి కాకుండా ఇష్టంతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పట్టుదలతో చదువుకుని వనపర్తి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిశంకర్, జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ సయ్యద్ కలాంపాషా, రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు గోనూరు యాదగిరి, ఎండి నిరంజన్, ఎండి పాషా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## జిల్లా అధికారులు తమ పర్యటనల నివేదికలను సమర్పించాలి : జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 10 ప్రభాతవార్త:** జిల్లాలో అధికారుల పర్యటనలకు సంబంధించిన నివేదికలు సమర్పించాలని, ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన సమీకృత జిల్లా సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఉదయ్‌కుమార్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 220 ఫిర్యాదులు అందగా అందులో 180 ఫిర్యాదులు ధరణికి సంబంధించినవి కాగా 40 ఫిర్యాదులు వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల జిల్లా అధికారులకు సంబంధించి ముందస్తు పర్యటనల డైరీ వివరాలు ఎంత మంది సమర్పించారు, ఇంకా సమర్పించాల్సిన వారి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు అడ్వాన్స్ టూర్ డైరీలతో పాటు టూర్ డైరీలను సమర్పించాలని అందురు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలోని కార్యాలయాలను సందర్శించి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించలా చూడాల్సి ఉందన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికి సమర్థవంతంగా అందేలా చూడాలన్నారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసేలా క్షేత్ర స్థాయి పర్యటనలు ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల వారిగా అధికారులు పరిశీలించి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పీడీ డీఆర్డీఎ నర్సింగ్‌రావు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు, డీటీ బాల్‌రాజు, కలెక్టర్ ఫియస్ ఖాజామైనుద్దిన్, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## కొత్త మత్స్యకారుల సహకార సంఘాల నమోదులో నాగర్‌కర్నూల్ జిల్లా అగ్రగామి..

**-జిల్లా మత్స్యశాఖ అధికారిని అభినందించి సన్మానించిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 10 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇటీవలే నిర్వహించిన ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మత్స్యకారుల సభ్యత్వ నమోదులో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచినందుకు సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మత్స్యశాఖ మంత్రివర్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధర్‌సిన్హా, కమిషనర్ లచ్చిరాం భూక్యలు నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మప్పను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మప్ప మాట్లాడుతూ జిల్లాలో మత్స్యకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి కుటుంబాలు, మత్స్య సంపద ద్వారా గరిష్టంగా లబ్ది పొందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యేశంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ప్రయత్నంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా వివిధ నీటి వనరులలో ఉచితంగా చేప పిల్లలను వదలడం ద్వారా వ్యవసాయం మరియు మత్స్య పరిశ్రమతో సహా అనుబంధ రంగాలను ప్రొత్సహిస్తుందన్నారు. జలవనరులు నామ మాత్రపు రుసుముతో మత్స్యకారుల సహకార సంఘాలకు లీజుకు ఇవ్వబడ్డాయని, జిల్లాలో లోతట్టు చేపల వేటను లాభదాయకమైన వృత్తిగా మార్చిందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మత్స్యకారుల సహకార సంఘాల సంఖ్య 2014-15లో 139 నుంచి 2022-23 నాటికి 224కు పెరిగిందన్నారు. సభ్యత్వం 12500 నుంచి 16200లకు పెరిగిందన్నారు. అదే విధంగా చేపల ఉత్పత్తి 2014-15లో 4 వేల మెట్రిక్ టన్నులకు ఉండగా 2023 ప్రస్తుతానికి 14వేల మెట్రిక్ టన్నులకు పెరిగిందన్నారు. ఫలితంగా జిల్లాలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మత్స్య సంపద కీలక పాత్ర పోషించిందన్నారు.



జిల్లా మత్స్యశాఖ అధికారిని అభినందించి సన్మానించిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

# కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల తీరువల్లే వెనుకబాటు..!

**70 ఏళ్లుగా ఏ రంగంలో అభ్యున్నతి లేదు**

**దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందుతోంది**

**రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 10 ప్రభాతవార్త :** మనదేశం కంటే వైశాల్యంలో ఎంతో చిన్నచిన్న దేశాలు సైతం అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని కాని స్వాతంత్రం ఏర్పడిన తర్వాత దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల తీరువల్ల దేశం నేటికి అభివృద్ధి చెందలేదని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఒకప్పుడు ఎంతో వెనుకబడిన దక్షిణ కొరియా లాంటి దేశాలు ఎంతో అభివృద్ధి చెందాయని మంత్రి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేట నీలకంఠస్వామి దేవాలయం కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో బిజెపి నాయకుడు కాళ్ల శ్రీనివాసులు సహా ఆయన ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు సుమారు 100 మందికి పైగా మంత్రి సమక్షంలో అధికార బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు వేసి మంత్రి స్వాగతం పలికారు. అంతకు ముందు నీలకంఠస్వామి దేవాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. ఇటీవల దక్షిణ కొరియాలో అధికారిక ప్రకటన నిర్వహించామని, ఒకప్పుడు ఆర్థికంగా ఎంతో వెనుకబడిన ఆ దేశం నేడు ప్రపంచంలోనే టాప్ టెన్ దేశాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. యునైటెడ్ సింగపూర్ మలేషియా లాంటి చిన్న చిన్న దేశాలు కూడా అభివృద్ధిలో భారతదేశానికంటే ఎంతో ముందున్నాయన్నారు. దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బిజెపి పార్టీల అసమర్థ విధానాల వల్లే దేశం అభివృద్ధి చెందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మన రాష్ట్రం అభివృద్ధిలో మిగతా రాష్ట్రాల కంటే ఎంతో ముందుందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధి వికేంద్రీకరణ కోసం కొత్త జిల్లాలను ఏర్పాటు చేశామని మహబూబ్‌నగర్ చిన్న జిల్లాగా మారడం వల్ల అభివృద్ధిలో వెనుకబడి పోతుందని అందరు పేర్కొన్నారని అయితే నేడు ఊహించని విధంగా అభివృద్ధిలో దూసుకుపోతున్నట్లు మంత్రి తెలిపారు. దేశ విదేశాల్లో ఉన్న పర్యాటక సొబగులను మహబూబ్‌నగర్‌కు తెస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి పర్యాటకులు తరలి వచ్చేలా చేస్తామన్నారు. వీరన్నపేట, టిడిగుట్ట వంటి వెనుకబడిన ప్రాంతాలను కూడా సమాంతరంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తుండడం వల్ల వీరన్నపేటలో ఒక ఎకరా సుమారు రూ. 2 కోట్లకు పైగా ధర పలుకుతుందని తెలిపారు. పట్టణాన్ని నలువైపులా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా వాసులు ఎవరు వలసలు వెళ్లకుండా స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా చూస్తామన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చి కులం, మతం పేరిట రాజకీయం చేసే వాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కో ఆప్షన్ సభ్యులు జ్యోతి, రామలింగం, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాములు, పార్టీ నాయకులు లక్ష్మణ్, సత్యనారాయణ, నవకాంత్, చంద్రకాంత్, వర్ధభాస్కర్ పాల్గొన్నారు.



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి

# దరఖాస్తుల పరిశీలనను పూర్తి చేయాలి..

**హరితహారం అంచనాలను పంపించాలి**

**స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా సోక్‌పిట్ల నిర్మాణానికి స్థలం గుర్తించి వెంటనే ప్రతిపాదనలు పంపించాలి: జిల్లా కలెక్టర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 10 ప్రభాతవార్త :** ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను సరైన విధంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమ వారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజలవద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే ఫిర్యాదులు అక్కడే పరిష్కరించాలని, మండల స్థాయిలో పరిష్కారం కానీ వాటిని జిల్లా స్థాయికి పంపించాలని చెప్పారు. అన్ని ఫిర్యాదులను పూర్తి క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇదివరకే ఆదేశించినట్లు తహసిల్దార్ వారి పరిధిలోని రైస్ మిల్లులను తనిఖీ చేసి వెంటనే నివేదిక ఇవ్వాలని, ఈ విషయంలో జాప్యం చేయవద్దని, అలాగే జిల్లా పౌరసరఫరాల మేనేజర్, పౌర సరఫరా అధికారులు సైతం కొన్ని మిల్లులను తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని చెప్పారు. వెనుకబడిన కులాల ఆర్థిక సహాయంకై వచ్చిన అన్ని దరఖాస్తులను వెంటనే విచారణ చేసి ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 15,787 దరఖాస్తులు రాగా ఇంకా 5000ల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాల్సిందని, ఎంపిడిఓలతో పాటు, మున్సిపల్ కమిషనర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇదివరకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం అంచనాలను పంపించాలని చెప్పారు. స్వచ్ఛసర్వేక్షన్ గ్రామీణ పథకం కింద సోక్‌పిట్ల నిర్మాణానికి స్థలాలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు పంపించాలని, ముఖ్యంగా ప్రతి గ్రామపంచాయతీకి 5 చొప్పున పంపించాలని ఆదేశించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్నికెజిబివిలను ఎంఈఓ, అలాగే నిర్దేశించిన ఇతర అధికారులు తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలని కలెక్టర్ చెప్పారు. రెవెన్యూ, స్థానికసంస్థల అదనపుకలెక్టర్ కె.సీతారామారావు, స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ, ఆర్డీఓ అనిల్‌కుమార్, డిఆర్‌డిఓ యాదయ్య, డిపిఓ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు ప్రజల వద్ద ఫిర్యాదులు స్వీకరించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ జి. రవినాయక్

## నలుగురు ఎస్సైల బదిలీ..

**- ఉత్తర్వులు జారీ చేసిన జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 10, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లాలోని నలుగురు ఎస్సైలను బదిలీ చేసినట్లు ఎస్పీ నరసింహ వెల్లడించారు. ఈమేరకు జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇప్పటికే మూడు రెండుసార్లు ఎస్సైలను బదిలీ తాజాగా సోమవారం మూడో సారి నలుగురిని బదిలీ చేశారు.

| ఎస్సై పేరు | ప్రస్తుత స్టేషన్ | బదిలీ ప్రాంతం |
|---|---|---|
| జయప్రసాద్ | డీఎస్‌బీ మహబూబ్‌నగర్ | నారాయణపేట రూరల్ పీఎస్ |
| ఏ నాగరాజు | డీఎస్‌బీ మహబూబ్‌నగర్ | ఎస్సై2 జడ్చర్ల పీఎస్ |
| పీ శ్రీనివాసులు | సీసీఎస్ మహబూబ్‌నగర్ | ఎస్‌హెచ్‌వో భూత్పూర్ |
| వై భాగ్యలక్ష్మిరెడ్డి | ఎస్సై2 భూత్పూర్ | డీటీసీ జడ్చర్ల |

## గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలి:అదనపు కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, జులై 10 ప్రభాతవార్త :** సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, హరితహారం కార్యక్రమాలపై జడ్పీసీఈఓ, డిఆర్‌డిఓ, డిఆర్‌డిఓ, డిపిఓ, ఎంపిడిఓలతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ఈ సం దర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాల పనులు ఏ మేరకు పూర్తయ్యాయో తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రణాళిక బద్ధంగా ముందుకు పోవాలని ఆదే శించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ, డిఆర్‌డిఓ, డిపిఓ, అన్ని మండలాల ఎంపిడిఓలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## బాధితులకు అండగా ఉండాలి..

**- చిత్తశుద్ధితో పని చేయాలి - ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ నరసింహ**

**మహబూబ్‌నగర్‌బ్యూరో, జూలై 10, ప్రభాతవార్త:** ప్రజాసమస్యల పరిష్కారానికి పోలీ స్‌శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎస్పీ నరసింహ అన్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రజల నుంచి ఆరు ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజావాణిలో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. పోలీస్ పరిధిలోని ప్రతి అంశాన్ని పరిష్కరించడంలో బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవడంలో ముందుండాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని తెలియజేస్తూ చట్టవ్యతిరేఖంగా వ్యవహరిస్తున్న వారి చర్యలు తీసుకుంటామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని విడిచిపెట్టమని హెచ్చరించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ నరసింహ

# రూ.28.5కోట్ల వ్యయంతో నర్సింగ్ కళాశాల నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే..

**త్వరలో 500ల కోట్ల వ్యయంతో**

**మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం**

**సెప్టెంబర్‌లో 300ల పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవం**

**గద్వాల ప్రతినిధి, జులై 10 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో దౌదర్‌పల్లి శివారులో రూ. 28.5 కోట్ల వ్యయంతో నర్సింగ్ కళాశాల భవనం భూమి పూజ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యేకు, ఛైర్మన్‌కు కాంట్రాక్టర్ పుష్పగుచ్ఛ అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. నర్సింగ్ కళాశాల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గత ప్రభుత్వాలు గత పాలకులు ఈ ప్రాంతంలో సరైన వైద్య సదుపాయాలు కల్పించలేకపోయారు. ఏ చిన్న ఆపద వచ్చినా ఎలాంటి వైద్యము లేక ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేక వైద్యులు లేక సామాన్య పేద ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనేవారు. ఈ ప్రాంతం నుండి కర్నూలు, హైదరాబాద్, రాయచూర్ వంటి ప్రాంతాలలో వైద్యం కోసం వెళ్లేవారు. ఏదైనా అనుకోని సంఘటన రోడ్డు ప్రమాదం జరిగిన ఇక్కడ వైద్యం అందక ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో దారిలోనే కొంతమంది ప్రాణాలను కోల్పోవడం జరిగింది. నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే వైద్య రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ సీఎం కెసిఆర్ వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు రాష్ట్రంలో అన్ని జిల్లాలతో సమానంగా జోగులాంబ గద్వాల జిల్లా కూడా ప్రత్యేకంగా దృష్టిపెట్టి ఈ ప్రాంతంలోని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తూ అన్ని రకాల పరీక్షలు టిహబ్, 134 రకాలు, రెండు లక్షల మంది దాకా టీ హబ్‌లో పరీక్షలు నిర్వహించుకోవడం జరిగింది. రేడియాలజీ ఇంకా అధినేతకరమైన కార్పోరేటర్స్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని అన్ని రకాల వైద్య సదుపాయాలు డాక్టర్లను అందుబాటులో ఉంచడం జరిగింది. గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి 70, ప్రస్తుతం 700లకు దాదాపుగా ఓపిలు కొనసాగుతున్నాయి. గర్భిణీ స్త్రీలు గతంలో ప్రైవేట్ ఆసుపత్రిలో 30,40 వేల రూపాయలు ఖర్చుచేసి ప్రసవం చేసుకునేవారు. కాని నేడు ప్రభుత్వ ఆసుపత్రిలోని గర్భిణీ స్త్రీలు చికిత్స పొందుతూ ప్రసవం చేసుకుని కెసిఆర్ కిట్ తీసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో ఈ ప్రాంతంలోని విద్యార్థులు నర్సింగ్ కాలేజీ కోసం మెడికల్ కాలేజీ విద్యకోసం ఇతర ప్రాంతాలోని ప్రైవేట్ కళాశాలలోని డబ్బులను ఖర్చుపెట్టి విద్యనభ్యసించేవారు. సామాన్య ప్రజలకు వారి పిల్లలు డాక్టర్ కావాలనే కోరికుండేది. ఆ కోరిక నెరవేరేది కాదు. నేడు తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్‌తో సాధ్యమవుతుంది. ప్రతి గ్రామీణ ప్రాంతంలోని ప్రతి విద్యార్థి కూడా విద్యార్థులు, యువత కూడా నర్సింగ్ కాలేజీ మెడికల్ కాలేజీలో వారి ప్రాంతాలలోని చదువుకుని వారి తల్లి దండ్రులు కలగన్న కలను సాధ్యం చేస్తూ వారి గ్రామంలోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే విధంగా మెడికల్ కాలేజీ నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 300ల పడకల ఆసుపత్రినిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, సెప్టెంబర్ నాటికి ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్, జడ్పీ వైస్ ఛైర్మన్ సరోజమ్మ, వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపిపి ప్రతాప్‌గౌడ్, జడ్పీటిసి రాజశేఖర్, కౌన్సిలర్ దౌలు, నాగిరెడ్డి, నరహరి, శ్రీనివాసులు, శ్రీను, శ్రీమన్నారాయణ, కృష్ణ, మహేష్, గద్వాలటౌన్ పార్టీ అధ్యక్షుడు గోవిందు, ఆలయ కమిటి ఛైర్మన్ సతీష్, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సాయిశ్యామ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ధర్మనాయుడు, ఆలయకమిటి డైరెక్టర్ కమ్మరి రాము, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్‌నాయుడు, చక్రధర్ రావు, శ్రీనివాస్‌రెడ్డి, నాగులు యాదవ్, రామకృష్ణశెట్టి, సుధాకర్, రిజ్వాన్, భగీరథ వంశీ, మధు, ఓం ప్రకాష్, కురుమన్న, చిన్నయ్య, పరశురాముడు, గోపాల్, కృష్ణ, గాంధీ, వీరేష్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ లెక్చరర్లు, గద్వాల మండల పార్టీ యూత్ అధ్యక్షుడు వేణు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

## రాష్ట్ర కన్స్యూమర్ ఫోరం ఛైర్మన్ గట్టు తిమ్మప్పను పరామర్శ

**నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్**

**గద్వాల ప్రతినిధి, జులై 10 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర కన్స్యూమర్ ఫోరం ఛైర్మన్ గట్టు తిమ్మప్ప ఇటీవల కంటి శస్త్ర చికిత్స చేయించుకుని గద్వాలలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న గట్టు తిమ్మప్పను నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్, జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులతో కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు ఆలూరు వెంకట్రాములు, దయాకర్, రామాంజనేయులు, లక్ష్మన్న, శాంతన్న, దరెప్ప, జమ్మన్న, తిరుమలేష్, నర్సింహులు, వెంకటేష్‌లు ఉన్నారు.



## నేడు దేవరకద్రలో పోచమ్మబోనాల పండుగ..

**-ముగిసిన కట్టమీది మైసమ్మ,తాయమ్మ వేడుకలు**

**దేవరకద్ర, జులై 10 ప్రభాతవార్త:** దేవరకద్రలో గ్రామదేవత పోచమ్మబోనాల పండుగను మంగళవారం జరుపుకోవాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. ఈ పండుగను పట్టణ ప్రజలు కలిసి కట్టుగా సాంప్రదాయ రీతిలో అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. అయితే దేవరకద్రలో పోచమ్మబోనాల పండుగను ఎప్పుడు జరుపుకోవాలో ముందుగానే గ్రామపెద్దలు సమావేశమై నిర్ణయించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ పోచమ్మబోనాల పండుగను ఎప్పుడు జరుపుకోవాలో నిర్ణయించడానికి గ్రామపెద్దలు సమావేశమై ఈనిర్ణయం తీసుకొన్నారు. అయితే పోచమ్మ బోనాలవేడుకలకు మందు ఇద్దరి గ్రామదేవతల వేడుకలను నిర్వహించడం ఆనవాయితి. అందులో భాగంగానే ఇదివరకే గ్రామదేవత కట్టమీది మైసమ్మ,తాయమ్మ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలుచేసి నైవేద్యాలు సమర్పించారు. ప్రధాన వేడుకైన గ్రామదేవత పోచమ్మబోనాల వేడుకకు అన్ని ఏర్పాట్లు చేశారు. గుడికి రంగురంగుల విద్యుత్ బల్బులతో శోభాయమానంగా అలంకరించారు. గుడి చుట్టూ వేపాకు తోరణాలు కట్టారు. అమ్మవారి వేడుక రోజు ముందుగా కురుమయాదవలు అమ్మవారికి అంబలితో నైదేద్యాలు సమర్పిస్తారు. అనంతరం సాయంత్రం 4లకు అమ్మవారికి బోనాల వేడుకను నిర్వహిస్తారు.



## ఘనంగా జాతీయ మత్స్య రైతు దినోత్సవం

**వనపర్తి టౌన్, జూలై10, ప్రభాతవార్త:** వనపర్తి పట్టణ కేంద్రంలోని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో జాతీయ మత్స్య రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ బి.లక్ష్మయ్య , పుర వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ లక్ష్మి నారాయణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ... స్వాతంత్ర్యం వచ్చి 76 సం.లు గడిచిన గత ప్రభుత్వాల పాలనలో మత్స్య రైతులకు గుర్తింపు లేకుండాపోయిందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్య రైతులను గుర్తించి అధికారికంగా జాతీయ మత్స్య రైతు దినోత్సవాన్ని నిర్వహించి, మత్స్య రైతులను గుర్తించినందుకు రాష్ట్ర సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ పుట్ట బాలరాజు మాట్లాడుతూ... మత్స్య రైతులను గుర్తించి గౌరవించిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రమోటర్ కృష్ణయ్య, లక్ష్మయ్య, రంగస్వామి, శ్రీను, శివ , మత్స్య సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



## మహిళలకు సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలి

**అమరచింత, జూలై10, ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలో 4వ వార్డులో పెండింగ్‌లో ఉన్న సామూహిక మరుగుదొడ్ల పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తు సోమవారం అచల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు అనంతమ్మ , ఆకాశవాణి మాట్లాడారు. 4వ వార్డులో సామూహిక మరుగుదొడ్లు లేకపోవడం వల్ల మహిళలకు బహిరంగ బహిర్భూమికి వెళ్తున్నారని వర్షాకాలంలో రాత్రి వేళలో పాముల బెడద ఉందని తక్షణమే మున్సిపల్ అధికారులు 4వ వార్డులో సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. 5వ వార్డులో సామూహిక మరుగుదొడ్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని తక్షణమే అధికారులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు మద్దతుగా కెవిపిఎస్, సీఐటీయు, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళలు చిట్టెమ్మ, వసంత, మంజుల, సత్యమ్మ, కిష్టమ్మ, అరుణ, శాంతమ్మ, దుర్గా, సరళ, సుంకులమ్మ, కురుమక్క పాల్గొన్నారు.




## మద్యంను పెంచి పోషించడం కోసమే ఇథనాల్ ఉత్పత్తి..

**కంపెనీ రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదు**

**మక్తల్, జులై 10 ప్రభాతవార్త :** ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని జులై 1న మొదలైన నిరవధిక రిలే ధర్నాలు సోమవారానికి 10వ రోజుకు చేరాయి. సావిత్రిభాయి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గన్నారపు సరోజన ప్రారంభించారు. ధర్నాలో కూర్చున్న వారిలో మహిళా సంఘం సభ్యులు ఈరపాగ సైదమ్మ, శివలింగమ్మ, మొగిలిచర్ల శిరీష, విలాష్, రైతులు రామచంద్రయ్య, మధు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్బంగా సరోజన మాట్లాడుతూ ఇథనాల్ ఉత్పత్తి చేయడం వెనుక మద్యాన్ని పెంచి పోషించే కుట్ర భారతదేశ వ్యాప్తంగా ఉందని తెలిపారు. యువతను, మగవాళ్లను తాగుడుకు బానిసలుగా మార్చడం వల్ల కుటుంబ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమై కుటుంబాలను నడిపే బాధ్యత మహిళలపై పడుతుందని తెలిపారు. యువత, పురుషులు తాగి రోడ్డు ప్రమాదాలకు గురి కావడానికి, మహిళలపై హత్యలకు, అత్యాచారాలకు మద్యమే ప్రధాన ఆయుధంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి మద్యాన్ని ఉత్పత్తి చేయడానికి ఇలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన మహిళల శ్రమను వ్యవసాయం నుండి వేరు చేయలేమన్నారు. ఇక్కడ కంపెనీ ఏర్పాటు చేయడం వలన మహిళలకు ఉపాధిని దూరం చేస్తూ మహిళల జీవితాలు ఛిన్నాభిన్నం చేస్తున్న ఈ ఇథనాల్ కంపెనీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.




## ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

**ఉండవెల్లి, జులై 10 ప్రభాతవార్త :** ఉండవెల్లి మండల వ్యాప్తంగా ఇండ్ల స్థలాలు లేని అర్హులందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తహసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జికె ఈదన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జీకె ఈదన్న మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారినా పేదల బ్రతుకులు మాత్రం మారడం లేదని, గత తొమ్మిది సంవత్సరాలగా ఉమ్మడి కుటుంబాలతో ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్న, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ అన్న నినాదం నిల్పుకోలేకపోయిందని దానివల్ల ఒకే ఇంట్లో రెండు, మూడు కటుంబాలు కాపురాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. తక్షణమే అర్హులను గుర్తించి ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సింగరాజు మద్దిలేటి, సిఐటియు జిల్లా నాయకులు యం. వెంకటేశ్వర్లు, కార్మిక సంఘం నాయకులు వెంకటరాముడు, ఆటో నరసిమ్మ, లోకమ్మా, మద్దమ్మ, సుజాత, శ్రీదేవి, కృష్ణమ్మ, సునిత, శేఖర్, వెంకట్, మల్లి తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికి బీఆర్ఎస్ సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ..!

**వనపర్తి టౌన్ , జూలై10, ప్రభాతవార్త:** మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడినడ పట్టణానికి చేసిన అభివృద్ధి పనులను ఇంటింటికి తిరిగి చేసిన అభివృద్ధిని బీఆర్ఎస్ నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పలుస రమేష్ గౌడ్, జిల్లా గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షులు పెండెం కురుమూర్తి యాదవ్, వనపర్తి మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, సింగిల్‌విండో ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి, తిరుమల మహేష్, వనపర్తి పట్టణ ఇంచార్జీ అరుణ్ ప్రకాష్, కౌన్సిలర్ లక్ష్మి నారాయణ, కౌన్సిలర్ భాషా నాయక్, పెండెం నాగన్న యాదవ్, కంచె రవి, గంధం శరవంద, స్టార్ రహీం, కదిరి జంపన్న , గోపాల్ యాదవ్, ఉంగూరు గోపాల్, నక్క రాములు, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, బండారు కృష్ణ, శివ గౌడ్, భారతి ప్రధాన కార్యదర్శులు గంధం పరంజ్యోతి ఆవుల రమేష్, బొబ్బిలి ప్రేమ్ కుమార్, మాదిరాపల్లి శ్రీనివాసులు, హెచ్ఎన్ కుమార్, సూర్యవంశం గిరి, దేవర్ల నరసింహ గులాం ఖాదర్ ఖాన్, కావలి మధులత, జోయాబ్ , గట్టు రవి, బెంగాలీ రఘు, నందిమల్ల శ్యాంకుమార్, ఇమ్రాన్, మర్రికుంట శ్రీను, డానియల్, ఏకే పాషా, అరిఫ్ పాషా, ఏకె పాషా, సోషల్ మీడియా నాగరాజు, కొమ్ము లక్ష్మి, చీర్ల శ్రీనివాసులు, లోకాజీరావు, చీర్ల కేశవులు, బీరయ్య, గంధం రత్నం, గొర్ల రామచంద్రయ్య, పసుపుల చంద్రయ్య, వజ్రాల రమేష్ పాల్గొన్నారు.





ఇంటింటి కరపత్రాలు పంపిణీ చేసి బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు అభివృద్ధిని వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థలు బంద్

**- ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యు విద్యార్థి సంఘాల పిలుపు**

**అమరచింత, జూలై10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతు ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, ఇంటర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ఈ బంద్‌లో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు జీఎస్ భవనంలో మండల కేంద్రంలోని కార్యాలయంలో విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాఘవ, పీడీఎస్‌యు జిల్లా నాయకులు విజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్పోరేట్, ప్రైవేట్ ఫీజులు దందా కొనసాగుతున్న ఇప్పటికీ ప్రభుత్వం వాటి నియంత్రణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని మంత్రులు, ఉప సంఘం, తిరుపతిరావు కమిటీ రిపోర్టు బహిర్గతం చేయకపోవడం చూస్తే ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లుగా ఉందని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా యూనిఫామ్స్ ఇవ్వలేదు అని, కొన్ని టైటిల్స్ పాఠ్య పుస్తకాలు పంపలేదు అని, చదువులు చెప్పే టీచర్లు లేరు, పారిశుద్ధ్య కార్మికులు లేరు అనేక సమస్యలతో విద్యా సంవత్సరం ప్రారంభమైన నిర్దిష్టమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవడం లేదు అని, తాగునీరు, మధ్యాహ్న భోజనం బిల్లుల పెండింగ్, మూత్రశాలలు, సరైన మౌళిక సదుపాయాలు లేక ప్రభుత్వ విద్యారంగం గొల్లుమంటుందని, మన ఊరు మన బస్తి, మన బడి నిధులు గుత్తేదారులు తూతూ మంత్రంగా మానరతమే పనులు నిర్వహిస్తున్నారని, కానీ ఎక్కడా సరిగ్గా పాఠశాలలకు ఉపయోగపడింది లేదని అన్నారు. రాష్ట్రంలో గత నాలుగేళ్ల నుండి ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్ షిప్స్ , 5,177 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కనీసం విడుదల చేయడం లేదని, గురుకులాలు, కేజీబీవీలు, ఇంటర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసిన కేజీబీవీలు భవనాలు లేక అరకొర సౌకర్యాలతో అద్దె భవనాల్లో నడుస్తున్నాని, వాటికి నిధులు లేవు, లెక్చరర్స్, టీచర్స్ లేరు అని, నాణ్యమైన భోజనం లేక ఫుడ్ ఫాయిజన్ అవుతున్న ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా బంద్ విజయవంతం చేయాలని విద్యార్థి లోకానికి వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాఘవ

## వెలుగు అభ్యాస మిత్ర బుక్‌ను విడుదల చేసిన మండల విద్యాధికారి

**మక్తల్, జులై 10 ప్రభాతవార్త :** సమగ్ర శిక్ష నారాయణపేట, జిల్లా కలెక్టర్ నారాయణపేట వారి సౌజన్యంతో వెలుగు అభ్యాసమిత్ర (వర్క్‌బుక్ లెవల్ 1) 2,3వ తరగతులకు అభ్యాసమిత్ర (వర్క్‌బుక్ లెవల్ 2) 4వ,5వ తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితం అభ్యాస కృత్యాలలో పట్టు సాధించేందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రాయోజిత అభ్యసన సంసిద్ధత కార్యక్రమం 2023,24 విద్యాసంవత్సరానికి 45 రోజుల ప్రత్యేక కార్యక్రమం వెలుగు అభ్యాసమిత్రను వారు ప్రారంభించారు. అందులో భాగంగానే కార్యక్రమానికి సంబంధించిన వర్క్‌బుక్‌లను మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాధికారి ఎం. వెంకటయ్య అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే నారాయణపేట జిల్లా అక్షరాస్యతలో ముందుండాలనే ఆకాంక్షతో, మారుమూల గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితం విషయాలపై మంచి పట్టు సాధించాలనే తలంపుతో కలెక్టర్ 45 రోజుల ప్రత్యేక వెలుగు అభ్యాసమిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారని కలెక్టర్ ఆలోచనలకు ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులందరు ఈ 45 రోజులు వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అత్యవసరం అయితే తప్ప సెలవులు వాడుకోవద్దని సమయ పాలన పాటించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, విభీషణ్‌లతో పాటు ఎమ్మార్సీ సిబ్బంది అల్తాఫ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.




వర్క్‌బుక్‌ను విడుదల చేస్తున్న మండల విద్యాధికారి

## దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ మండల అధ్యక్షులను మార్చండి

**- టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్, ఉపాధ్యక్షులకు ప్రదీప్‌కుమార్‌గౌడ్, కొండ ప్రశాంత్‌రెడ్డిల వినతి**

**- త్వరలో అందరి సమన్వయతో మండలాలలకు కొత్త అధ్యక్షులు -ఏఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్‌కు భాధ్యతలు**

**దేవరకద్ర, జులై 10 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గంలోని ఆయా మండలాల కాంగ్రెస్ మండల అధ్యక్షులను మార్చాలని టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు వేంనరేందర్‌రెడ్డి గార్లకు దేవరకద్రకు చెందిన టీపీసీసీ ప్రధానకార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డిలు ఆదివారం కోరారు. ఈ నెల 4న దేవరకద్ర నియోజకవర్గంలోని 8 మండలాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ప్రకటించారు. అయితే అధ్యక్షుల నియామకాల పట్ల కార్యకర్తల నుండి వచ్చినటువంటి వ్యతిరేకతను టీపీసీసీ ప్రధానకార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డిలు పార్టీ అదిష్టానం దృష్టికి తీసుకవచ్చారు. దీంతో అట్టి నియామకాలను నిలుపుదల చేస్తూ ఈ విషయాన్ని డిసిసి అధ్యక్షుడికి అధిష్ఠానం నాయకులు వారికి తెలిపినట్లు వారు తెలిపారు. త్వరలోనే నియోజకవర్గ కాంగ్రెస్ మండల అధ్యక్షులను పార్టీ కార్యకర్తలందరి అభిప్రాయాలను తెలుసుకొని అందరి అభీష్టం మేరకే మండల అధ్యక్షుల, టౌన్ అధ్యక్షుల నియామకాలు జరుగుతాయని వారు తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులను అందరిని సమన్వయం చేసుకొని మండల అధ్యక్షులను నియమించాల్సిందిగా ఏఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్‌కు పార్టీ అదిష్ఠానం భాధ్యతలు అప్పగించిందని వారు తెలిపారు. దీనికి అందరు పార్టీ నాయకులు సహకరించాలని ప్రదీప్‌కుమార్‌గౌడ్, కొండ ప్రశాంత్‌రెడ్డిలు కోరారు.

## ఘనంగా జాతీయ చేపల దినోత్సవం..

**మక్తల్, జులై 10 ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రంలోని ముదిరాజ్ భవనంలో జాతీయ చేపల రైతుల దినోత్సవం సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా తొలుత ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం, తెలంగాణ రాబిన్‌హుడ్ పండగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున తరలివచ్చిన ముదిరాజ్‌ల సమక్షంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ ఇదే రోజున చేపల పెంపకంలో ప్రేరిత సంతోనోత్పత్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగొన్న డా. కెఎల్ చౌదరి, డా.అలికున్ని కృషిని అభినందిస్తూ వారి జ్ఞాపకారథం ఇదేరోజున దేశ వ్యాప్తంగా జాతీయ చేపల రైతుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా యావత భారతదేశం అంతా ముదిరాజ్‌లు పెద్ద సంఖ్యలో అత్యున్నత పదవుల్లో ఉన్నారని, ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. మొత్తం నియోజకవర్గ కేంద్రంలో పండగ సాయన్న విగ్రహ ప్రతిష్టాపనకు త్వరలోనే చర్యలు తీసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నేతలు బి. నర్సింలు, మామిళ్ల కిష్టప్ప, తిరుపతి, నరసింహులు, డా. శ్రీరామ్, కావలి శ్రీహరి, వల్లంపల్లి లక్ష్మణ్, కర్నిగోపి, వాకిటి శ్యామ్, మామిళ్ల పృథ్వీరాజ్, గుంతలి శివకుమార్, అశోక్, కట్టా వెంకటేష్, రేణుకా నర్సింహ, హన్మంతు, బుగ్గప్ప, లొడ్డ అంజి, నవీన్‌కుమార్, తిరుపతి, వెంకటేష్, తిరుపతి, ఆంజనేయులు, రమేష్, వాకిటి రమేష్, కల్లూరి గోవర్ధన్, ప్రవీణ్ పాల్గొన్నారు.



జాతీయ చేపల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## చేపలు ఆరోగ్యానికి ఎంతో మేలు..

**- వీపనగండ్ల మండల మత్స్యశాఖ అధ్యక్షులు వెంకటయ్య - ఘనంగా జాతీయ చేపల రైతు దినోత్సవ వేడుకలు**

**వీపనగండ్ల, జూలై10, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో సోమవారం జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ మేకల సురేంద్రబాబు ఆధ్వర్యంలో జూలై 10న మత్స్య రైతుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు చెందిన వివిధ గ్రామాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షుల సమక్షంలో జాతీయ చేపల రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీపనగండ్ల మండల మత్స్య శాఖ అధ్యక్షులు వెంకటయ్య మాట్లాడుతూ... భారతదేశం ప్రతి సంవత్సరం జూలై 10వ తేదీన జాతీయ చేపల రైతు దినోత్సవాన్ని జరుపుకుంటుందని అన్నారు. చేపలకు స్థిరమైన నిల్వలు ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలను నిర్ధారించడానికి దేశం మత్స్య వనరులను నిర్వహించే విధానంలో మార్పులపై దృష్టిని ఆకర్షించడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని వారన్నారు. చేపల పెంపకంలో చేప రైతులు, ఆక్వాప్రెన్యూర్లు , ఫిషర్‌ఫోక్లు, భాగస్వాములు, చేపల పెంపకంలో వారి సహకారం కోసం ఇంకా చేపల పెంపకంలో ఎవరు సంబంధం కలిగి ఉన్నారో వారిని గౌరవించడానికి ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గోవర్ధనగిరి ఉపాధ్యక్షులు యాటకిరి నాగన్న, కార్యదర్శి గుంటి మహేశ్వర్, అమ్మాయిపల్లి అధ్యక్షులు కోళ్ల వెంకటేశ్వర్లు, గోపాల్‌దిన్నె అధ్యక్షులు రమణమోని యాదయ్య, కల్వరాల అధ్యక్షులు రమణమోని గోపాల్, వివిధ గ్రామాల సొసైటీల డైరెక్టర్లు బొలమోని పెంటన్న, పడిగన్న, సభ్యులు రామకృష్ణ, దర్గేష్, భానుచందర్, నరసింహ, బాలస్వామి, శేఖర్, రామచంద్రయ్య, నాగన్న తదితరులు పాల్గొన్నారు.



జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న మత్స్య కార్మికులు

## జాతీయ బిసి సంక్షేమ సంఘం సంయుక్త కన్వీనర్‌గా లింగప్ప నియామకం

**దేవరకద్ర, జులై 10 ప్రభాతవార్త:** జాతీయ బిసి సంక్షేమసంఘం సంయుక్త కన్వీనర్‌గా పొర్ల లింగప్ప నియామకం అయ్యారు. ఈ మేరకు సామాజిక, రాజకీయ, ఉద్యమ నాయకుడు పొర్ల లింగప్పను జాతీయ బిసి సంక్షేమసంఘం సంయుక్త కన్వీనర్‌గా ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్వర్యంలోని యమించినట్లు బిసి నాయకులు తెలిపారు. హైద్రాబాద్‌లోని విధ్యానగర్‌లో ఈ నెల 9న జరిగిన బిసి ముఖ్య నాయకుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొన్నారన్నారు. ఈమేరకు పొర్లలింగప్పకు నియమకపు పత్రాన్ని ఆర్.కృష్ణయ్య అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్బంగా లింగప్ప మాట్లాడుతూ సంఘం తమపై పెట్టుకొన్ని నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేస్తానన్నారు. బిసిల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. దీనికి బిసిలందరు తమకు సహకరించాలని లింగప్ప కోరారు.



## 5వ రోజుకు చేరిన పంచాయతీ కార్మికుల సమ్మె



**గండీడ్, జులై 10 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె ఐదవ రోజుకు చేరుకుంది. సోమవారం వారికి మద్దతుగా ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య మాట్లాడుతూ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని వారికి 11వ పిఆర్‌సి ప్రకారం బేసిక్ 19 వేల రూపాయలు చేయాలని కార్మికులు మణించిన పక్షంలో నష్టపరిహారంగా పది లక్షలు ఇవ్వాలని వారికి ఆదివారం పండగ దినాల్లో సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హస్నాబాద్ వెంకటయ్య, మల్లయ్య, పంచాయతీ సిబ్బంది అధ్యక్షుడు పెంటయ్య పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## రెండవ రోజు ప్రజాహిత పాదయాత్ర



**నవాబ్‌పేట, జులై 10 ప్రభాతవార్త :** మండలంలోని హన్మసానిపల్లి గ్రామం నుంచి కూచూరు మీదుగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనుంపల్లి అనిరుధ్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. ఆయనతో పాటు మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థికసాయం చేసిన ఉపసర్పంచ్



**నవాబ్‌పేట, జులై 10 ప్రభాతవార్త :** మండలంలోని ఇప్పటూర్ గ్రామానికి చెందిన సన్నీళ్ల లక్ష్మి నారాయణ (47) అనారోగ్యంతో మృతి చెందటం జరిగింది. వారి మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ ఇప్పటూర్ ఉపసర్పంచ్ దుబ్బ రవికిరణ్ అంత్యక్రియలకు రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనతో పాటు టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు స్వామి, శంకర్, మైసయ్య, గోపాల్, సన్నీళ్ల రాజు కోడిగంటి బాల్‌రాజు, మరాటి రాములు పాల్గొన్నారు.

# త్వరలో జరిగే బీసీ గర్జన సభను జయప్రదం చేయండి

● ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం రాహుల్ గాంధీ బీసీలకు, యువతకు ప్రకటించిన 50 శాతం ఎమ్మెల్యే సీట్లను తెలంగాణలో ప్రకటించాలి : జిల్లా కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**వనపర్తి టౌన్,జూలై10,ప్రభాతవార్త:** త్వరలో జరిగే బీసీ గర్జన సభను జయప్రదం చేయాలని, ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం రాహుల్‌గాంధీ బీసీలకు, యువతకు ప్రకటించిన 50 శాతం ఎమ్మెల్యే సీట్లను తెలంగాణలో ప్రకటించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాటా్లడుతూ.. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం యువతకు బీసీలకు 50 శాతం సీట్లను కేటాయించాలని, మేనిఫెస్టోలో బీసీలకు 40 శాతం కేటాయిస్తామని, పీసీసీ ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేతలందరూ అడుగులు ముందుకు వేసి బీసీ ఐక్యవేదిక ఏర్పాటు చేయడం జరిగిందని, బీసీ గర్జనకు కంకణం కట్టుకున్న సందర్భంగా మొన్న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో హనుమంత్‌రావు , కత్తి వెంకటస్వామి సమావేశం ఏర్పాటు చేసి వనపర్తి నుండి మమ్మల్ని పిలవడం జరిగిందని అన్నారు. మాకు ఇచ్చిన బాధ్యతల ప్రకారం వనపర్తి నియోజకవర్గంలో ఉన్నటువంటి ఏడు మండలాలు, మున్సిపాలిటీలలో బీసీలను జాగృతం చేసి, బీసీ ఐక్యవేదిక ద్వారా ప్రతి ఊరు ప్రతి మండలం తిరిగి బీసీ గర్జనకు పెద్ద ఎత్తున జాగృతం చేసి, వనపర్తి లాంటి బీసీ జనాభా అధికంగా ఉన్న సీట్లను బీసీలకుఇవ్వాలని ఒత్తిడి తెచ్చిదామాషా ప్రకారం మాసీట్లు మేము సాధించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ పీసీసీ మెంబర్ శ్రీనివాస్ గౌడ్, పీసీసీ డెలిగేట్ శంకర్ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్, మాజీ మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, మాజీ యువత అధ్యక్షులు నందిమల్ల చంద్రమౌళి, శేఖర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

## ఘనంగా జాతీయ మత్స్యకారుల దినోత్సవం



మత్స్యకారుల దినోత్సవం జరుపుకుంటున్న మత్స్యకారులు

**ఖిల్లాఘణపురం,జూలై10,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని స్థానిక ప్రయాణికుల ప్రాంగణ ఆవరణంలో జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా సోమవారం మత్స్యకారుల సంఘం జిల్లా డైరెక్టర్ మండల అధ్యక్షులు అనమోని కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల నుండి ముదిరాజ్ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా డైరెక్టర్ కృష్ణయ్య మాట్లాడుతూ... మత్స్యకారులు ఇప్పుడిప్పుడే వృత్తిపై ఆధారపడే వారికి మార్కెట్ విలువలు తెలుస్తున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముదిరాజ్ మత్స్యకారులకు ప్రత్యేక చట్టం తేవాలని చెరువులలో వాటా కోసం పూర్తి హక్కులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం జిల్లా డైరెక్టర్ కృష్ణయ్య, జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొడుగుసత్యం, బీఎస్పీ మండల అధ్యక్షుడు గోపాల్, వార్డు సభ్యులు పేపర్‌చెన్నయ్య, శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం!

- కడుకుంట్ల మెడికల్ ఆఫీసర్ రస్మితరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ రస్మితరెడ్డి

**వనపర్తి వైద్యవిభాగం,జూలై10,ప్రభాతవార్త:** మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రబలే సీజనల్ వ్యాధుల నివారణకు వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలని మెడికల్ ఆఫీసర్ రస్మిత రెడ్డి అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి, సూచనలతో కడుకుంట్ల మెడికల్ ఆఫీసర్ రస్మితరెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలోని నాగవరం ప్రభుత్వ బీసీ బాలల వసతి గృహం, ప్రభుత్వ బాలుర కళాశాల వసతి గృహంలో విద్యార్థులకుమెడికల్ క్యాంపునిర్వహించడంజరిగింది. విద్యార్థులకు వ్యాధుల నివారణకు దోమకాటుతో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు కూడా వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటిస్తు ఆరోగ్య చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమకాటుతో వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు రాకుండాముందు జాగ్రత్తలుతీసుకోవాలన్నారు. వసతిగృహంలోని విద్యార్థులకు ఆల్ అవుట్, దోమ తెరలు వాడాలని వంట గది పరిసర ప్రాంతాలు నీటి నిల్వ లేకుండా పొడిగా ఉంచి శుభ్రత పాటిస్తు ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి ఎస్. ఆంజనేయులు, మెడికల్ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జూపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**కల్వకుర్తి, జూలై10 ప్రభాతవార్త:** చారకొండ మండలంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జూపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ అచల్ సారథ్యంలో నిర్వహించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, లయన్స్‌క్లబ్ ఆమనగల్లు, కామినేని ఆసుపత్రి డాక్టర్ల సహకారంతో ఏర్పాటు చేసిన వైస్ ఎంపీపీ వెంకటయ్యయాదవ్, సర్పంచ్ మల్లేశ్వరి బాలరాజులు ప్రారంభించారు. ఆసుపత్రిలో 255 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి కావాల్సిన వారికి మందులను అందించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ జగపతి, వార్డు సభ్యులు రామచంద్రయ్య, జంగయ్య, భగత్‌సింగ్ యూత్ సభ్యులు ఉన్నారు.

## ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఇటుక అందజేత



**కల్వకుర్తిరూరల్, జూలై10 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన కందనూలు లక్ష్మమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఇల్లు అసంపూర్తిగా నిలిచిపోయింది. గత వారంలో పంజుగుల గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహించినటువంటి మెగా వైద్య శిబిరంలో ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన ఇల్లు నిర్మాణానికి అవసరమయ్యే రూ.50 వేలు విలువ చేసే ఇటుకను అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు సోమవారం ఉప్పల ట్రస్ట్ సభ్యుల సహకారంతో ఇటుకను అందించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు దారమోని గణేష్, దేవేందర్, రామస్వామి తదితరులు ఉన్నారు.

# ఆగని నల్ల నీళ్లు!



వృథాగా కారుతున్న నల్లా నీరు

- ఎంసీహెచ్‌లో వృథాగా పారుతున్న నీరు
- సీసీలు సక్రమంగా వేయకపోవడంతో సమస్య ఉత్పన్నం
- కన్నాలు ఏర్పరచుకుని పురుగు పుట్ర లోపలికి వచ్చే ప్రమాదం
- అక్కడక్కడ పైప్ కనెక్షన్ లేకపోవడంతో పేరుకుపోతున్న ఆహార పదార్థాలు



బాత్రూంలో పగిలిపోయిన వాటర్ ఫ్లష్ బాక్సు

**వనపర్తి వైద్యవిభాగం,జూలై10,ప్రభాతవార్త:** జిల్లాసమీపంలోని నర్సింగాయపల్లి శివారులో గల ఎంసీహెచ్ ప్రభుత్వ ఆసుపత్రిలో నీళ్ల నల్లాల వెంట నిర్విరామంగా నీరు కారడం జరుగుతుంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా గత ఏడాది ప్రారంభమైన మాతా శిశు సంరక్షణ కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందడం శుభ పరిమాణం, ఈ తరుణంలో అక్కడక్కడ ఆసుపత్రి నిర్మించిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కొన్ని దర్శనమిస్తున్నాయి. బాత్రూంలో నల్లాల నుండి నిరంతరం నీరు వృథాగా పోవడం, నల్లాలు పగిలిపోయి ఉండడం, ఫ్లష్ బాక్సులు పగిలిపోయి ఉండడం వంటి లోపాలు కనిపిస్తున్నాయి. అదే విధంగా తాగునీరు పక్కనే మురుగునీరు నిల్వ ఉండడం ద్వారా మంచినీళ్ల కోసం వచ్చే రోగులు నీరు పట్టుకోవడానికి జంకుతున్నారు. ఆపూటకు శుభ్ర పరిచినప్పటికీ నిల్వ నీరు సమస్య పూర్తిస్థాయిలోపరిష్కారం కాలేదు. తాగునీరు దగ్గర సీసీ రోడ్డు వేసినప్పటికీ అది సమాంతరంగా సీసీ రోడ్డును వేయకపోవడం వల్ల నీరు నిల్వ కావడం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతే కాకుండా సీసీ నిర్మాణం పూర్తిస్థాయిలో వేయకపోవడం వలన భూమిలో నుండిఎలుకలు, పందికొక్కులు, బొక్కలు ఏర్పరచుకుని హాస్పిటల్ లోపలికి వచ్చే ప్రమాదం కూడా ఉంది. కొద్ది రోజుల క్రితం హాస్పిటల్ లోకి పాము రావడం కలకలం రేపింది. ఈ సమస్యలపై త్వరగా స్పందించి కాంట్రాక్టర్లు సమస్యను పరిష్కరిస్తే ఆసుపత్రికి వచ్చే రోగులకు, రోగుల సహాయకులకుసౌకర్యవంతంగా ఉంటుందని అభిప్రాయంవ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా రోగులు వారి బంధువులు తిన్న తరువాత మిగిలిన ఆహార పదార్థాలను కడిగి బాత్రూంలో పోయడం ద్వారా కిందికి వస్తున్న ఆహార పదార్థాలు కింద అన్ని ఒకే చోట పడడం వల్ల దుర్గంధంగా మారుతుంది. ఇలాంటి సమస్యలు పరిష్కారం కావాలంటే అక్కడక్కడ నెలకొన్న చిన్న చిన్న లోపాలను సరి చేయాల్సిన బాధ్యత ఆసుపత్రి నిర్మించిన కాంట్రాక్టర్‌పై ఉందని ఆసుపత్రికి వస్తున్న ప్రజలు అంటున్నారు. దీనిపై ఆసుపత్రి వైద్యాధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



**త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం : డాక్టర్ నరేంద్రకుమార్, సూపరింటెండెంట్, జనరల్ ఆసుపత్రి, వనపర్తి ...** మాతా శిశుసంరక్షణ కేంద్రంలో నెలకొన్న నల్లాల లీకేజీల సమస్యలను వీలైనంత త్వరలోనే పరిష్కరిస్తాం. ఆసుపత్రి నిర్మించిన టీఎస్ఎంఎస్ఐడీసీ కాంట్రాక్టర్‌కు నల్లాల లీకేజీ సమస్య ఇప్పటికే తెలియజేశాం. ఏఈ సంబంధిత అధికారులకు సమస్యను మరొకసారి వివరించి ట్యాప్ లీకేజీ సమస్యను పరిష్కరించి నీటి వృథాను అరికడతాం.



అపరిశుభ్రంగా ఉన్న ఆసుపత్రి పరిసరాలు

# కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

-బీజేపీ రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి



గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

**వెల్దండ, జూలై 10 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజలు, వ్యాపారులు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో బీజేపీ పార్టీ నాయకులతో కలిసి ఆచారి సోమవారం కార్మికులు, కర్షకులు, వ్యాపారస్థులు, ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ దేశ అభ్యున్నతి కోసం వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టి అమలు పరుస్తున్నారన్నారు. సుకన్య సమృద్ధి యోజన, అయిష్మాన్ భారత్, రైతులకు సబ్సిడీ ఎరువులతో పాటు మరిన్ని పథకాలను అందిస్తున్నది కేంద్ర ప్రభుత్వమైతే చెప్పుకుంటున్నది రాష్ట్ర ప్రభుత్వమని తెలిపారు. గ్రామంలో పర్యటించి పేరు పేరున ప్రజలందరిని పలుకరించి యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, మండల పార్టీఅధ్యక్షులు విజయేందర్ రెడ్డి, జంగయ్యయాదవ్, బాలస్వామి, మట్టపరమేష్, పాండు, మోహన్‌రెడ్డి, శ్రీనివాసాచారి, చక్రవర్తి, వెంకట్రాములు, కోటి, విష్ణుగౌడ్, యాదయ్య, ఆనంద్, రామకృష్ణ, మల్లేష్ తదితరులు ఉన్నారు.

# ఉన్నత విద్యలో మెరిసిన పాలమూరు తేజం



వసంతాదేవిని సన్మానిస్తున్న పీయూ వీసీ, రిజిస్ట్రార్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూలై10, ప్రభాతవార్త:** ఇటీవల తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన దశాబ్ది సంబురాల్లో పాలమూరు యూనివర్సిటీలో పూర్వ విద్యార్థిని వసంతాదేవికి ఘన సన్మానం చేయడంపై పీయూ అధ్యాపక బృందం సోమవారం పాలమూరు యూనివర్సిటీలో అభినందించారు. ఈమేరకు వీసీ ఆచార్య లక్ష్మీకాంత్ రాథోడ్ రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు, ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపల్ కిషోర్, హెచ్‌వోడీ నాగరాజులు వసంతాదేవినిసన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపి సన్మానించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలమూరు యూనివర్సిటీ స్థాయిలో అత్యున్నత శ్రేణిలో రాణించి బంగారు పతకం సాధించిన వసంతాదేవిని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ మాత్యులు సబితా ఇంద్రారెడ్డి శాలువా ప్రశంసా పత్రంతోపాటు రూ.10వేల నగదు అందజేసి సన్మానించారు. 2012-21 విద్యాసంవత్సరంలో పాలమూరు విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ గణితశాస్త్రాన్ని అభ్యసించి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలై విశ్వవిద్యాలయ కులపతి రాష్ట్ర గవర్నర్ తమిళిసైం చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్న వసంతాదేవి యూనివర్సిటీలో ఉన్న అన్ని కోర్సుల్లోకెల్లా ఉనత్న శ్రేణిలో నిలువడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికై దశాబ్ది ఉత్సవాల్లో సన్మానించారు.

# గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

- జీవో 51ను రద్దు చేసి మల్టిపర్పస్ వర్కర్ విధానాన్ని తొలగించాలి : బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ నాగనమోని చెన్నరాములు ముదిరాజ్



పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న దృశ్యం

**వనపర్తి టౌన్,జూలై10,ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్మికుల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 5వ రోజు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ నాగనమోని చెన్నరాములు ముదిరాజ్ సంపూర్ణ మద్ధతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను 11వ పీఆర్‌సీ సిఫార్సుల మేరకు రూ.19వేలు కనీస వేతనం చెల్లించాలని పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు డ్యూటీలో చనిపోయిన కార్మికులకు పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, జీవో నం.51ని రద్దుచేసి, మల్టిపర్పస్‌వర్కర్స్ విధానాన్ని తొలగించాలని, ఆదివారం సెలవు దినంగా ప్రకటించి, పండుగ సెలవులు ఇవ్వాలని, అర్జిత సెలవులు అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించి తక్షణమే కొనసాగుతున్న సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. సమ్మెకు మద్దతు తెలిపిన వారిలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఆర్గనైజింగ సెక్రటరీ గద్దం మహేష్, బీవీఎఫ్ జిల్లా కో కన్వీనర్ సుభాష్ చంద్ర, స్వేరో జిల్లా అధ్యక్షులు మంజుల రమేష్, బీఎస్పీ వనపర్తి, గోపాల్‌పేట, రేవల్లి మండలాల అధ్యక్షులు దండు రాజు, వంశీకృష్ణ, అజయ్, కాటిక కురుమయ్య, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షులు రామచంద్రయ్య, తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల ముసుగులో సామాన్య ప్రజలపై భారం

- పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు వెంటనే తగ్గించాలి : రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి నందిమల్ల శారద



మహాధర్నాలో పాల్గొన్న రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి నందిమల్ల శారద

**వనపర్తి టౌన్,జూలై10,ప్రభాతవార్త:** పెరిగిన నిత్యవసర ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తు రాష్ట్ర తెలుగు మహిళా ఆధ్వర్యంలో కాసుబ్రహ్మానందరెడ్డి పార్కు ఎదురుగా మహాధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా నందిమల్ల శారద మాట్లాడుతూ... సంక్షేమ పెరిట ప్రజలను మభ్యపెడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి పాల్పడుతూ ధరలు పెంచి సామాన్య ప్రజలపై మోయలేని భారం వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు కూరగాయల ధరలు పెరిగిన కనీసం ప్రభుత్వంసమీక్ష చేయకుండా ధరలపెరుగుదలను పట్టించుకోకపోవడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే సిలిండర్, పెట్రోల్, డీజిల్, విద్యుత్ ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు, కూరగాయలు, నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ పెద్దలకు అవినీతిపై ఉన్న ధ్యాన ప్రజల సంక్షేమంపై లేదని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం తమిళనాడు తరహాలో రేషన్ షాపులలో సబ్సిడీపై కూరగాయలు, నిత్యవసర సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు.

## పంచాయతీ కార్మికుల వంటావార్పు



సహపంక్తి భోజనం చేస్తున్న కార్మికులు

**వెల్దండ, జూలై 10 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టే సమ్మె 5వ రోజుకు చేరుకుంది. పంచాయతీ కార్మికులు వంటావార్పు ద్వారా నిరసన కార్యక్రమాన్ని చేపట్టి పంచాయతీ కార్మికులు అక్కడ సహపంక్తి భోజనం చేశారు. పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి జీవో నెం.60 ప్రకారం జీతాలు చెల్లించి, బిల్ కలెక్టర్ సహాయ కార్యదర్శులుగా నియమించి పర్మినెంట్ చేయాలని కోరారు. పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు వై. విజయేందర్‌రెడ్డి సంఘీభావం తెలిపి రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంలో వారిది కీలక పాత్ర అని, ప్రభుత్వం స్పందించి కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భీమా తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జంగయ్యయాదవ్, నాయకులు రాజేందర్‌రెడ్డి, బాలస్వామి, వెంకట్రాములు, కోటి, పంచాయతీ సిబ్బంది మురళి, యాదయ్య, విమల్, మైనుద్దిన్, లక్ష్మినారి, బొజ్జయ్య, భీమమ్మ, నరేష్, కృష్ణ, నీలమ్మతో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కారించాలని జులై 12న విద్యాసంస్థల బంద్




మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**మక్తల్,జులై 10 ప్రభాతవార్త:** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12న రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునివ్వడం జరిగింది. ఈసందర్భంగా మక్తల్‌లో పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో సమస్యలు పరిష్కరించకుండా విద్యాసంవత్సరం ప్రారంభమైనా కనీసమైన సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా పాఠ్య పుస్తకాలను యూనిఫార్మ్, నోట్‌బుక్స్ అందించాల్సి ఉన్న ఇప్పటికి నెల రోజులు గడుస్తున్నా అరకొర పుస్తకాలను అందించి చదువులను కొనసాగించుకోమనిచెబుతున్నారు. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురాకుండా ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగాఅనుమతులు విద్యార్థుల తల్లిదండ్రులను అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలన్ని పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘల ఆధ్వర్యంలో 12న దేశవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు పిలుపునివ్వడం జరిగింది. విద్యా సంస్థల యాజమాన్యాలువిద్యార్థులు, తల్లిదండ్రులు ఈబంద్‌కు సహకరించి విజయవంతంచేయాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధానకార్యదర్శిఅజయ్, ఉపాధ్యక్షురాలు సంధ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు నయ్యుం, సాకేత్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు అజయ్, శేఖర్‌లు పాల్గొన్నారు.

## శరవేగంగా కొనసాగుతున్న రోడ్డు విస్తరణ సుందరీకరణ పనులు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు రోడ్ల సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న వజ్రాల రమేష్

**వనపర్తి టౌన్,జూలై10,ప్రభాతవార్త:** మంత్రి చొరవతో శరవేగంగా కొనసాగుతున్న రోడ్డు విస్తరణ సుందరీకరణ పనులను బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు వజ్రాల రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా కేంద్రం ఏర్పాటైన తరువాత పెరిగిన వాహనాల రద్దీ దృష్ట్యా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వనపర్తి ప్రజల చిరకాల వాంఛ గత 30 ఏండ్ల నుండి మరుగున పడ్డ రోడ్డు విస్తరణ పనులను మంత్రి ప్రత్యేక చొరవతో నేడు రూపుదిద్దుకుంటున్నాయని, రోడ్డు విస్తరణ లో నష్టపోయిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించి దాదాపు 90 శాతం రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయించిన ఘనత మంత్రి నిరంజన్‌రెడ్డికే దక్కిందని వజ్రాల రమేష్ కొనియాడారు. జిల్లా ప్రజల తరపునముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు, మంత్రి నిరంజన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విస్తరణ అయిన రోడ్లలో సెంట్రల్ లైటింగ్‌తో పాటు డివైడర్‌ను ఏర్పాటు చేసి అందమైన చెట్లనుగ్రీనరీఏర్పాటుకుపట్టణరోడ్లు సుందరీకరణకు సిద్ధమైనట్లు తెలిపారు.

## పిహెచ్‌సిని ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరెందర్‌రెడ్డి

**మద్దూరు,జులై 10 ప్రభాతవార్త:** కొత్తగా ఏర్పాటైన కొత్తపల్లి మండలంలో ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే పట్నం నరెందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పోరేట్ ఆసుపత్రికి వెళ్లి లక్షలు ఖర్చుచేసి వైద్యం చేసుకోవడం కంటే, తెలంగాణ ఏర్పడిన తర్వాత కెసిఆర్ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పోరేట్ ఆసుపత్రిలో కంటే ధీటుగా మెరుగైన వైద్యంఅందిస్తుందని అన్నారు. బిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, మండలస్థాయి ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నంబావి మండలానికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రాక

**చిన్నంబావి,జూలై10,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పెద్దదగడ గ్రామ ప్రజల ప్రభుత్వ ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమానికి కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రానున్నారని మండల అధ్యక్షుడు ఈదన్న యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత 19 సం.లు మంత్రిగా ఎమ్మెల్యేగా పరిపాలించిన జూపల్లి కృష్ణారావు సొంత గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్న చూసిచూడనట్లుగా ఉన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్న పెద్దదగడ గ్రామ ప్రజలకు ఇళ్ల స్థలాల పట్టా పంపిణీ గెలిచిన ఐదు సంవత్సరాలలోపు చేయబోతుండడం బీరం హర్షవర్ధన్‌రెడ్డికే సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమానికి చిన్నంబావి మండల ప్రజాప్రతినిధులు , మండల సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో డైరెక్టర్లు, రైతుసమన్వయ సంఘం సభ్యులు, గ్రామ పార్టీఅధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి అభిమానులు, పెద్దదగడ గ్రామ ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనికార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

## సమస్యలు ఆరా తీస్తూ.. పథకాలను వివరిస్తూ..

- ప్రజాహిత పాదయాత్రలో ముందుకు సాగిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



అనిరుధ్‌రెడ్డిని సన్మానిస్తున్న స్థానిక నాయకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 10, ప్రభాతవార్త:** టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చేపట్టిన ప్రజాహిత పాదయాత్ర సోమవారం రెండో రోజు నవాబుపేట మండలం హన్మసానిపల్లి, కూచురు, దొడ్డిపల్లి, మల్రెడ్డిపల్లి,ఇప్పటూరు, చెన్నారెడ్డిపల్లి మీదుగా సాగింది. ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి పాదయాత్రకు ప్రతి తండా,గూడెం, గ్రామంలో దారిపొడవునా ఆయనకుఘన స్వాగతం పలికారు.ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ యాత్రను కొనసాగించారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.2లక్షల రుణమాఫీ, అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.నిరుద్యోగ భృతి రూ.4వేలు అందజేస్తామన్నారు. తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమి లేదని, కేసీఆర్ కుటుంబమే బాగుపడంది కాని ఏ ఒక్క వర్గం అభివృద్ధి చెందలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే పోలెపల్లి ఎస్సీ షెడ్‌లో జడ్చర్ల నియోజకవర్గ నిరుద్యోగ యువతకు 30శాతం ఉద్యోగఅవకాశాలు కల్పిస్తామని హామీఇచ్చారు.కూచురులో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.



అనిరుధ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

# పల్లెలకు మహర్దశ

## పల్లెలే పట్టణాలకు పట్టుగొమ్మలు : కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**కల్వకుర్తి, జూలై 10 ప్రభాతవార్త:** పల్లెలే పట్టణాలకు పట్టుకొమ్మలుగా నిలుస్తూ అభివృద్ధికి దోహద పడేందుకు అన్ని విధాలుగా పల్లెలను అభివృద్ధి చేసి పల్లెల్లో జీవిస్తున్న ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు ప్రత్యేక చొరవ చేపడుతున్నామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామంలో ఆరోగ్య కేంద్ర పరిధిలోని, కల్వకుర్తి పట్టణంలోని హనుమాన్‌నగర్ మరియు తోటపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలోని మార్చాల, తర్నికల్ గ్రామాల్లో పల్లె దవాఖానాల నూతన భవనాలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తూ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండామౌళిక సదుపాయాలను కల్పించి గ్రామాలాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పల్లెలను అభివృద్ధి పరిచి పల్లెల్లో జీవిస్తున్న ప్రజల జీవన విధానాన్ని మెరుగు పర్చేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టామని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకంగా పేద ప్రజల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ముందు చూపుతో వ్యక్తిగత రుణాలను అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.సుధాకర్‌లాల్, ఉప వైద్యాధికారి కె.భీమానాయక్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కమిషనర్ అశిష్‌కుమార్,ఎంపీపీ సామ మనోహర్‌చెన్నకేశవ, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## ప్రజల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం : ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**కల్వకుర్తి, జూలై 10 ప్రభాతవార్త:** ప్రజల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన జ్యోతికి మంజూరైన రూ.16వేలు, కుర్మిద్ద గ్రామానికి చెందిన గిరీష్‌కు మంజూరైన రూ.36వేలు, సురేందర్‌కు మంజూరైన రూ.47,500ల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరప్రధాయినిగా నిలుస్తోందన్నారు. ప్రమాదాల్లో గాయపడ్డ వారు, అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. కార్యక్రమంలో ఆయామండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న దృశ్యం

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

**మాగనూరు,జూలై10 ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మాగనూరు మండల కేంద్రంలో హైస్కూల్ నుండి సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా కో కన్వీనర్ ఆంజనేయులు,సీనియర్ నాయకులు భరత్‌కుమార్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా 10,11,12 తేదీలలో టోకెన్ సమ్మెలో భాగంగా స్కూళ్లలో వంట బంద్ పెట్టి కార్మికులు నిరసన కార్యక్రమాలు చేయడం జరిగింది. ఈ మధ్యాహ్న భోజన కార్మికుల మెనూ ఛార్జీలను పెరుగుతున్న ధరలకనుగుణంగా పెంచాలని జిఓ నంబర్ 8 ప్రకారం పెరిగిన వేతనానికి ఏరియర్స్‌తో కలిపి ఇవ్వాలని కోడిగుడ్డుకు అదనపు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా 2022లో మార్చిలో ప్రకటించిన మూడువేల గౌరవ వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత భీమా సౌకర్యం పిఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని రెండు జతల కాటన్ బట్టల యూనిఫామ్, గుర్తింపు కార్డులు, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని పాఠశాలలోకనీస వసతులు కల్పించాలని మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయపాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదుని అక్రమ తొలగింపులు అరికట్టాలని రాజకీయ వేధింపులు ఆపాలని, బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వాలని, సామాజిక భద్రత కల్పించాలని పెరుగుతున్న ధరలకనుగుణంగా మెనూ సవరించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్‌కు అందజేశారు. ఈ ధర్నాకు మద్దతుగా సిపిఎం పార్టీ కార్యదర్శి గొల్ల నరేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోవిందు, సాగెన్నోల మారెప్ప, మాగనూరు కృష్ణ మండలాల మధ్యాహ్న భోజన యూనియన్ నాయకులుప్రమీల,లక్ష్మి, దేవమ్మ,మైముదా, బాబు, మంగమ్మ,సరస్వతి,ఉమాదేవి, మారెమ్మ,సారా వరలక్ష్మి, రూప, అంజమ్మ పాల్గొన్నారు.




ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

## మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారిద్దాం

- వాతావరణం మార్పులకు అనుగుణంగా వచ్చే వ్యాధులను అరికట్టాలి : వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి,జూలై10,ప్రభాతవార్త:** వాతావరణ మార్పులకు అనుగుణంగా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ జిల్లా అధికారులను ఆదేశించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణకు సంబంధించి సోమవారం ఉదయం ప్రజా వాణి హాల్‌లో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని లైన్ డిపార్ట్‌మెంట్ అధికారు లందరూ సమన్వయంతో పని చేసి మలేరియా, డెంగ్యూ,వాంతులు,విరేచనాలు వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించేందుకు కృషి చేయాలని ఆదేశించారు . గ్రామ సర్పంచులకు , కార్యదర్శులకు, జిల్లా పంచాయతీ అధికారులకు తగు సూచనలు ఇవ్వాలని, పరిసరాల పారిశుధ్యం దోమల నివారణ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో చేపట్టాలని సూచించారు. మున్సిపల్ అధికారులు తమ పరిధిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్య అధి కారులు కార్యాచరణ పథకం సిద్ధం చేసుకుని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సర్వే చేయాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రతపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. నీటి సరఫరా లీకేజీలను వెంటనే మరమ్మతులు చేయాలని బోరింగ్, నల్లాల వద్ద ప్లాట్‌ఫామ్స్ వద్ద సరైన నిర్వహణ ఉండాలని ఆదేశించారు. దోమలు గుడ్లు పెట్టకుండా పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, మూతలు లేని ట్యాంకులు,ఖాళీ సీసాలు, బయట కానీ టెర్రస్‌పైన కానీ లేకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నివారణ చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయడం, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అవగాహన కొరకు కరపత్రాలు అందించి అవగాహన కల్పించాలని తెలిపారు. అంగన్వాడీ ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లను,ఆశా కార్యకర్తలను ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ద్వారా సమావేశ పరిచి మలేరియా నివారణ పట్ల అవగాహన కల్పించాలని కోరారు.క్షేత్రస్థాయిలో గలఅధికారులు ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని వారిని భాగస్వామ్యం చేయాలని సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్లు, పాఠశాలలు, కార్యాలయాల్లో 100 శాతం దోమల రహితంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.మలేరియా డెంగ్యూవ్యతిరేక కార్యకలాపాలలో అందరూ పాలు పంచుకునే విధంగా చూడాలన్నారు.విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు మలేరియా నివారణ గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 16 డెంగ్యూ, 6 మలేరియా హై రిస్క్ ప్రాంతాలుగా గుర్తించామని, కట్టుదిట్టమైనచర్యలుతీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిశంకర్ వివరించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ తప్పనిసరి : జిల్లా కలెక్టర్

**వనపర్తి,జూలై10,ప్రభాతవార్త:** జూలై 20న నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1-19 సం.ల వయసు గల బాలబాలికలు ప్రతి ఒక్కరికి అల్బెండజోల్ మాత్రలు తినిపించే విధంగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రజావాణి హాల్‌లో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖ , ఎంపీడీవోలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సమన్వయం చేసుకుని 1-19 సం.ల వయసు గల ప్రతి ఒక్కరిని గుర్తించి టాబ్లెట్లు తినిపించాలన్నారు. ముందుగా పిల్లల తప్పులు లేని జాబితా తయారు చేయాలని,జూలై20న తప్పనిసరిగా ప్రతి ఒక్కరికి ఆల్బెండజోల్ టాబ్లెట్ వేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా తప్పితే వారిని గుర్తించి జూలై 27వ తేదీన అందే విధంగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పాఠశ్యాలలో మంచినీటి సౌకర్యం పుష్కలంగా ఉండే విధంగా చూడాలని తెలిపారు. జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని శాఖల వారు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ నరసింహులు, జడ్పీ సీఈవో తదితరులు పాల్గొన్నారు.

## భర్తపై మహిళా డాక్టర్ మౌన పోరాటం

- న్యాయం చేయాలని క్లినిక్ ఎదుట మహిళలతో బైఠాయింపు
- విడాకులు ఇవ్వాలని భర్త డాక్టర్ ప్రమోద్ ఒత్తిడి చేస్తున్నాడని ఆరోపణ

**వనపర్తి,జూలై10,ప్రభాతవార్త:** పట్టణ కేంద్రానికి చెందిన డాక్టర్ లక్ష్మి కుమారి తన భర్త నుండి న్యాయం జరగాలని ఆసుపత్రి ముందు మౌన పోరాటం చేపట్టారు.ఆమెకు మద్ధతుగా పలు మహిళా సంఘాలు నిరసనలో పాల్గొన్నారు. వనపర్తి పట్టణ కేంద్రంలో చర్మవ్యాధి నిపుణురాలు లక్ష్మి కుమారి కుటుంబ కలహాలతో సమస్య పరిష్కారం కావడంతో లేదని క్లినిక్ ముందు మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత 22 సం.ల నుండి ఇక్కడనే ప్రాక్టీస్ చేస్తున్నాని తన భర్త డాక్టర్ ప్రమోద్ కుమార్ వ్యక్తిగత స్వేచ్ఛ ఎప్పుడు ఇవ్వలేదని చాలా ఒత్తిడికి గురి చేశారని ఆమె తెలిపారు. డాక్టర్ ప్రమోద్ కుమార్ ఆయన కుటుంబ సభ్యులు తనని అనేక అన్యాయాలకు గురి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. తన వృత్తి ద్వారా వచ్చిన డబ్బులన్నీ లాగేసుకుని ఇంటి నుండి గెంటివేయాలని అర్థాంతరంగా క్లినిక్ రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేయించాడని, ఇలాంటి చర్యను నేను ఖండిస్తున్నానని ఆమె అన్నారు. 2024 వరకు రిజిస్ట్రేషన్ ఉన్న క్లినిక్ షటర్లను వెంటనే తెరిపించాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఫలితం లేదని అందుకే మౌన దీక్ష చేపడుతున్నానని ఆమె తెలిపారు. నా కష్టార్జితం అంతా క్లినిక్ కోసం , కుటుంబం కోసం ఖర్చు చేశానని అయినా నా భర్త నాకు విడాకుల నోటీసు పంపించాడని దీనిని నేను తిరస్కరిస్తున్నానని వెంటనే క్లినిక్ తెరిపించి నాకు నా కుమారైకు న్యాయం చేయాలని, తమకు న్యాయం జరిగే వరకు దీక్ష కొనసాగిస్తానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.




మౌన పోరాటం చేస్తున్న డాక్టర్ లక్ష్మికుమారి

## తెలంగాణ ఓ గొప్ప కళాకుడిని కోల్పోయింది

- సంస్మరణ సభలో పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 10, ప్రభాతవార్త:** తెలంగాణ సమాజం సాయిచంద్‌లాంటి గొప్ప కళాకారుడిని కోల్పోయిందని,ఇది ఎంతో బాధాకరమైన సంఘటన అని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సాయిచంద్ కుటుంబానికి సీఎం కేసీఆర్ అండగా ఉన్నారని సాయిచంద్ భార్యకు కార్పొరేషన్ చైర్ పర్సన్ పదవీ ఇచ్చి ఆ కుటుంబానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలిచారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో తెలంగాణ ఉద్యమ కారుల సంఘం, కవులు, రచయితలు,కళాకారులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాయకుడు సాయిచంద్ సంస్మరణ సభకు మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దివంగత సాయిచంద్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.తెలంగాణ రాష్ట్ర సాధనలోసాయిచంద్ పాత్రఎంతో విలువైందని మంత్రి తెలిపారు. ఆయన కుటుంబానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలిచిభరోసా నిచ్చారన్నారు.కార్యక్రమంలో కళాకారులు బాలచందర్, జయన్న, శివన్న, సీతారాములు, మహేశ్, తదిరతులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్స్‌కి సబ్సిడీ రుణాలు పంపిణీ

**వనపర్తి,జూలై10,ప్రభాతవార్త:** స్వయంఉపాధి పథకంలో భాగంగా వికలాంగుల వృద్ధుల, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో ఇద్దరు ట్రాన్స్ జెండర్స్‌కు వికలాంగుల వృద్ధుల,ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ హైదరాబాద్ సంచాలకులు రూ.50వేలచొప్పున సబ్సిడీ రుణాలు మంజూరు చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేతుల మీదుగా సబ్సిడీ రుణాల చెక్కులను ట్రాన్స్ జెండర్స్‌కు అందజేశారు.

## ఎల్‌వోసి అందజేసిన మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి,జూలై10,ప్రభాతవార్త:** జిల్లా కేంద్రానికి చెందిన మాసుంబాబా అనారోగ్యంతో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.లక్ష ఎల్‌వోసిని వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం లబ్ధిదారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అందజేశారు. లబ్ధిదారులు మంత్రి నిరంజన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్య ఏదైనా ప్రజలు నిర్భయంగా స్వేచ్ఛగా ఫిర్యాదు చేయండి: జిల్లా ఎస్పీ

**గద్వాల ప్రతినిధి,జూలై 10 ప్రభాతవార్త:** సమస్య ఏదైనా ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ కె. సృజన అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 12 మంది బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్ట పరిధిలోని సమస్యలను పరిష్కరించడానికి పోలీస్ శాఖ ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. ప్రజలు తమ సమస్యలు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయాలని , లేదా ఆపదలో ఉంటే స్థానిక పోలీసులకుగాని, డయల్ 100కు గాని ఫోన్‌చేసి సమస్య తెలపాలని, సమస్యలపై చట్ట పరంగా తగిన చర్యలు ఉంటాయని ఎస్పీ పేర్కొన్నారు.

## చిన్నజట్రం, కోటకొండ ఉప విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నారాయణపేట ప్రతినిధి,జూలై 10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్నజట్రం, కోటకొండ ఉప విద్యుత్ కేంద్రాల పరిధిలో 11కెవి లైన్ ఎవి స్విచ్లు ఏర్పాటు చేయనున్నందున మంగళవారం ఉదయం 10 గం.ల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ రెండు ఉప విద్యుత్ కేంద్రాల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని గ్రామీణ ఏఈ సాయినాథ్‌రెడ్డి తెలిపారు. కోటకొండ ఉప విద్యుత్ కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాలు తిర్మలాపూర్, అభంగాపూర్,బండగొండ,బొమ్మన్‌పాడు,నెమ్మల్లపల్లి,మేకహనుమాన్ తండా, ఊటకుంటతండా, కోటకొండకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే చిన్నజట్నం ఉప విద్యుత్ కేంద్రం పరిధిలో కొల్లంపల్లి, అంత్వార్, లింగంపల్లి, లింగంపల్లితండా, పందరగుట్ట తండా,లక్ష్మీపూర్, బోయిన్‌పల్లి, నల్లగుట్టతండా తదితర గ్రామాల్లో వ్యవసాయ రంగంతో పాటు,గృహ వినియోగదారులకు సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం

**ధరూర్,జూలై 10 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమికస్థాయి ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో మండలంలోని ఉపాధ్యాయులు హాజరై పాఠశాల స్థాయిలో చేపట్టాల్సిన తొలిమెట్టు ఆధారిత బోధన, పఠనోత్సవాలు, గ్రంథాలయ వారోత్సవాలు, ఒకటి నుంచి ఐదో తరగతి వరకు బేస్‌లైన్ టెస్టు, తయారీ గురించి చర్చించారు. సమావేశంలో ఎఫ్ఎల్ఎన్ మోడల్ ఆఫీసర్ నరేష్, మండల విద్యాధికారి సురేష్, ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రాఘవేంద్ర, ఎస్. రవిప్రకాష్, సీతంనాయుడు, రిసోర్స్ పర్సన్స్‌గా సిఆర్‌పి నర్సింలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెట్లు నరికి కబ్జాకు పాల్పడితే కఠిన చర్యలు

- మహ్మదాబాద్ ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ మగ్దూంహుసేన్

వార్త స్పందన



చెట్లు నరికిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు ఆఫీసర్లు

**మహ్మదాబాద్,జూలై10 ప్రభాతవార్త:** మండలంలోని గాదిర్యాల గ్రామంలో ఏళ్లనాటి చెట్లను నరికి వారిపై చర్యలు తీసుకోవాలి అనే కథనం వార్త పేపర్‌లో వచ్చిన కథనానికి స్పందించిన డిస్ట్రిక్ట్ ఫారెస్టు ఆఫీసర్ ఆదేశంతో సోమవారం నాడు మహ్మదాబాద్ ఫారెస్టు రేంజర్ బీట్ ఆఫసర్లతో కలిసి గాదిర్యాల 70సర్వేనంబర్లలో చెట్లు నరికిన అటవి భూమిని పరిశీలించారు. విచారణకు వచ్చిన ఫారెస్టు అధికారులపై మేమే కొట్టాం చెట్లు ఏం చేస్తారో చేసుకోండి మాకు పట్టా ఉంది మేమే చెట్లు నరికేశామంటూ కబ్జా చేసేందుకు చూస్తున్న ఓ వ్యక్తి కొంతమందిని తీసుకువచ్చి అధికారులపై గొడవకు పురికొల్పడం గమనార్హం. అక్కడికి వచ్చిన ఫారెస్టు అధికారులు సర్వే మ్యాప్‌లో ఫారెస్టుకు సంబంధించిన భూమి దీంట్లోకి వస్తే కఠిన చర్యలు ఉంటాయని జాయింట్ సర్వే చేసిన తర్వాత మీకు పట్టా ఉన్న భూమి ఉంటే అక్కడ చూసుకోండి మా ఫారెస్టు భూమిలోకి వస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అలాగే జిల్లా ఫారెస్టు స్పెషల్ పార్టీ మధ్యాహ్నం తరువాత మళ్లీ విచారణ చేపట్టారు. పూర్తి నివేదికను త్వరలో అందజేస్తామని ఎఫ్ఆర్ఓ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి రేంజర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

## పుస్తకాలు జీవితంలో ఒకభాగం కావాలి

**ఉట్కూర్,జూలై 10 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం పాఠశాలలో నేటి నుండి నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంపియుపిఎస్ నిడుగుర్తి పాఠశాలలో స్థానిక రిటైర్డ్ ఉపాధ్యాయులు అనంత్‌రెడ్డిచే గ్రంథాలయాల ప్రాముఖ్యత, ఉపయోగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ నాడు తాలపత్రాలలో రచించిన వేదాలు వంటి మహత్తర గ్రంథాల్లో రచించిన గొప్ప విషయాలే నేటికి ఎంతో మంది పఠించి భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తున్నాయని అన్నారు. ఎంతో మంది మహోన్నతులు, నాయకుల జీవిత చరిత్రలు భావితరాలకు మార్గదర్శనం చేసుకొనుటకు వారి పుస్తకాలు దోహదపడతాయని అన్నారు. పుస్తకాలను మించిన గొప్ప మిత్రుడు ఎవరు ఉండరు, అలవాటు చేసుకుంటే అంతకంటే మంచి వ్యసనం ఉండదని మనిషిగా మహర్షిగా మారుస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, సునిత, వెంకటప్ప, సుజాత, సలాం, ఆంజనేయులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడిచేస్తే సహించేది లేదు

**మహ్మదాబాద్,జూలై 10 ప్రభాతవార్త:** జర్నలిస్టులపై దాడి చేస్తే సహించేది లేదని ఉమ్మడి గండీడ్ మండల టిడబ్ల్యుజెఎఫ్ మండల అధ్యక్షులు నవీనకుమార్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గాదిర్యాల్ గ్రామంలో సర్వే నంబర్ 70ల రిజర్వు ఫారెస్టు కబ్జా రైతుల సమాచారంతో వి6 వెలుగు రిపోర్టర్, విశ్వజ్యోతి ఇతర జర్నలిస్టులను వార్తలు రాసినందుకు గాదిర్యాల్‌కు చెందిన శీలం హనుమయ్య బూతు మాటలతో దూషిస్తూ మీ అంతు తేలుస్తానని మీతో కబడ్డి ఆడతాను రండిరా అంటూ నీ అమ్మ జాగిరా ఫొటోలు తీయడానికి నాపొలంలోకి వచ్చారు నా పొలంలో ఫొటోలు తీయడానికి మీ ఇద్దరే ఉన్నారా పీకుడుగాళ్లు అంటూ దూషిస్తూ భయపెడుతూ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి బెదిరిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని స్థానిక మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు దస్తయ్య, ఆంజనేయులు, బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు దోమ వెంకటేష్, రామకృష్ణారెడ్డి, హనుమంతు, కె. వెంకటేష్, డి. వెంకటేష్ పాల్గొన్నారు.

## బీచుపల్లి కృష్ణానదిలో కలిపిన సాయిచంద్ అస్తికలు

**ఇటిక్యాల,జూలై 10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బీచుపల్లి కృష్ణానదిలో ప్రజా గాయకుడు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ అస్థికలను సోమవారం ఉదయం ఆయన భార్య రజిని, కుమారుడు, కూతురు కుటుంబ సభ్యులతోకలిసి బీచుపల్లికి చేరుకోగా అర్చకులు అనిల్‌శర్మ, నవీన్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి కృష్ణానదిలో అస్తికలను కలిపారు. గతనెల 29న సాయిచంద్ హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. ఆది వారం సాయిచంద్ దశదినకర్మను నిర్వహించారు.

## ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

**కోయిల్‌కొండ,జూలై 10 ప్రభాతవార్త:** కోయిల్‌కొండ మండలంలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఈషా ఫౌండేషన్ వాలంటీర్ జి. బస్వంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండల కేంద్రమైన కోయిల్‌కొండలో విలేఖరులతో మాట్లాడుతూ ఈషా ఫౌండేషన్ కోయంబత్తూరు వారు 15వ గ్రామోత్సవంలోభాగంగా తెలంగాణలోని తొమ్మిది జిల్లాల్లో ఈ క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ముందుగా మన మహబూబ్‌నగర్ జిల్లాలో ఆఖరున వాలీబాల్, త్రోబాల్ తదితర క్రీడలు నిర్వహించడం జరుగుతుందని ఈషా ఫౌండేషన్ వాలంటరీ జి. బస్వంత్‌రెడ్డి సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సైతం సూచించడం జరిగింది. క్రీడా పోటీలలో పురుషులు,స్త్రీలు పాల్గొనవచ్చని తెలిపారు.క్రీడలలోపాల్గొనే క్రీడాకారులకు బహుమతుల ప్రధానోత్సవంతో పాటు నగదు పారితోషికం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలం నుండి ప్రతి గ్రామం నుండి క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సర్పంచుల వేధింపులు ఆపాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 10, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికులపై సర్పంచుల వేధింపులు సరికాదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య అన్నారు. జడ్చర్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన సమ్మెలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె ఐదో రోజుకు చేరింది. మూడు నెలల కిందట కార్యదర్శులు సమ్మె చేయలేదా..ఇప్పుడు పంచాయతీ కార్మికులు చేస్తే తప్పు ఏందని ప్రశ్నించారు. కార్మికులపై ఎందుకు వివక్ష చూపుతున్నారన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని,పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.

## ఆరుతడి పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆల

**అడ్డాకుల,జూలై10,ప్రభాతవార్త:** మండలంలో ఆరుతడి పంటలు సాగు చేస్తున్న చౌడయపల్లి గ్రామ రైతు మన్యంకొండ బీరకాయ పంటను సోమవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రైతును అభినందించి రైతులు వరి సాగును తగ్గిస్తు కూరగాయలు, పప్పు ధాన్యాల పంటలు సాగు చేయాలని ఆయన సూచించారు.కూరగాయల సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని తెలిపారు.

## సివిల్ ఫిర్యాదులు కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలి

నారాయణపేట జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు

**నారాయణపేట ప్రతినిధి,జూలై 10 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వెంకటేశ్వర్లు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సోమవారం 8 ఫిర్యాదులను బాధితుల నుండి స్వీకరించి వాటిని చట్ట ప్రకారం పరిశీలించాల్సిందిగా సిఐ,ఎస్సైలకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని పిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్100 లేదా 1930కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.